ఈరోజు (27 సెప్టెంబర్) విజయవాడ యం.బి.విజ్ఞానకేంద్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ బహిరంగ సభ  ఆ వివరాలను ప్రచురణార్థం/ ప్రసారార్థం కొరకు మీకు పంపిస్తున్నాము.

– జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

# మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

## – రాజకీయాలకు అతీతంగా రైతాంగం ముందుకు రావాలి

## – వామపక్షాల ఆన్‌లైన్ బహిరంగం సభలో నేతలు పిలుపు

రైతాంగ, వ్యవసాయ, ప్రజల ప్రయోజనాలను కాపాడుకోవడానికి మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు రైతాంగానికి పిలుపునిచ్చారు. కరోనాను అడ్డం పెట్టుకుని రైతాంగ, వ్యవసాయ, ప్రజా వ్యతరేక విధానాలకు పాల్పడే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గొంతెత్తే నేతలపై జరిగే అరెస్టులకు వెనుకాడే ప్రసక్తే లేదని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామని వ్యాఖ్యానించారు. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం వామపక్షాలు ఇచ్చిన నిరసన దీక్షలపై వామపక్షాల కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు, కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక బిల్లులను నిరసిస్తూ ఆన్‌లైన్ బహిరంగ సభను వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ వామపక్షాల పిలుపు మేరకు నిరసన దీక్షల ఏర్పాట్లు విస్తృతంగా చేయాలని సూచించారు. 1950 నుండి రైతాంగానికి రక్షణగా ఉన్న సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా దెబ్బతీస్తోందని, ఈ క్రమంలోనే సబ్సిడీలు రద్దు, పరపతి సౌకర్యం కల్పించకపోవడం, మార్కెట్ ధరలు రాకుండా చేయడం వంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఇటువంటి బిజెపికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన మద్దతుగా నిలవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రమంతా వామపక్షాలు పర్యటించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ, వ్యవసాయ, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడతామన్నారు. 29న ప్రారంభం కానున్న దీక్షా శిబిరంలో 50 మంది రైతులకు తగ్గకుండా చూడాలని, దీక్షలో 10 మంది చొప్పున ప్రతిరోజూ కూర్చునేలా జాగ్రత్తలు పాటించాలని, మూడు రోజులూ దీక్షలను విజయవంతంగా పూర్తిచేయాలని సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రైతాంగం ఉద్యమంలోకి కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలోకి కలిసివచ్చే రైతు, ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయపార్టీలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వం రైతాంగ, వ్యవసాయ బిల్లులపై వెనక్కు తగ్గేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఫార్వర్డ్‌బ్లాక్, ఎస్‌యుసిఐసి, ఎంసిపిఐ(యు) రాష్ట్ర నాయకులు పి ప్రసాద్, పివి సుందరరామరాజు, సుధీర్, ఖాదర్‌బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేకంగా, పార్లమెంటు నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ తెచ్చిన రైతాంగ, వ్యవసాయ వ్యతిరేక బిల్లులను నాయకులు ఖండించారు. బిజెపి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ అనుకూల పరిపాలన వేగంగా అమలు చేస్తోందన్నారు. రైతుల పొట్టకొట్టి, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చేందుకు బిజెపి ప్రభుత్వం సంస్కరణల పేరుతో రాష్ట్ర అధికారాలను హరించివేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే విద్యుత్ సంస్కరణలు, డిస్కంలను ప్రైవేటీకరించడం, వ్యవసాయ మోటార్లకు నీటి మీటర్లు బిగించడం, రైతు, వ్యవసాయ వ్యతిరేక చట్టాలు తీసుకురావడం వంటి చర్యలకు కేంద్రం పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిరసన దీక్షల్లో తమ పార్టీలు కూడా పాల్గని జయప్రదం చేయడానికి కృషి చేస్తామన్నారు. వామపక్షాలతో పాటు రాజకీయాలకు అతీతంగా రైతాంగమంతా దీక్షల్లో పాల్గని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మిగిలిన వామపక్ష పార్టీలు ఆర్ఎస్‌పి. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, సిపిఐ(ఎంఎల్) పార్టీలు  నిరసన దీక్షలను జయప్రదం చేస్తామని ప్రకటించాయి.

= = = =